క్లుప్తంగా

యాదమరి వైద్యాధికారిగా అనిల్‌కుమార్ నాయక్

యాదమరి: స్థానిక ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారిగా డాక్టర్ అనిల్ కుమార్ నాయక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న వైద్యాధికారి జ్యోతి రెడ్డి అనారోగ్యంగా మృతి చెందడంతో ఆమె స్థానంలో అనిల్ కుమార్ నాయక్ విధుల్లో చేరారు. అనంతరం ఆసుపత్రి సిబ్బందికి సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కార్యక్రమంలో వైద్యాధికారి సురేఖ, సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



యాదమరి : ఏపీటీఎఫ్(257) నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను మండల విద్యాశాఖాధికారి రుక్మిణి ఆవిష్కరించారు. బుధవారం ఎంఆర్‌సీ భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు విజయకుమార్, అమర్‌నాథరెడ్డి, జగ్గు, మధు, శివశంకర్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన స్థల సమస్య పరిష్కారం



గ్రామస్తులతో మాట్లాడుతున్న తలపులపల్లె బాబురెడ్డి, అధికారులు

పూతలపట్టు : స్పందన కార్యక్రమంలో వచ్చిన శ్మశాన సమస్యను బుధవారం పరిష్కరించారు. గొడుగుచింత గ్రామానికి శ్మశానం కావాలంటు గ్రామస్తులు సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ విజయభాస్కర్‌కు వినతులు సమర్పించారు. ఈ మేరకు బుధవారం వైఎస్సార్ సీపీ నేత తలపులపల్లె బాబురెడ్డి, ఎంపీడీఓ గౌరి ఆధ్వర్యంలో సర్వే చేసి శ్మశానానికి స్థలం కేటాయించారు. గొల్లపల్లె పరిధి 196/2బి1 సర్వే నంబర్‌లోని స్థలాన్ని కేటాయించారు

ట్రాన్స్‌ఫార్మర్ ఈఈగా మహేశ్వర్‌రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్ : ట్రాన్స్‌కో ఉమ్మడి జిల్లా ట్రాన్స్‌ఫార్మర్ విభాగం ఈఈగా మహేశ్వర్ రెడ్డిని నియమించారు. గతంలో ఈఈగా ఉన్న భీమేశ్వర్‌రెడ్డి ఉద్యోగ విరమణ పొందారు. ఈ నేపథ్యంలో తిరుపతి కార్పొరేట్ కార్యాలయ ఎల్‌ఎంసీ డీఈగా ఉన్న మహేశ్వర్‌రెడ్డి ఉద్యోగోన్నతిపై ఆయన స్థానానికి బదిలీ అయ్యారు. త్వరలో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

రెండు రోజుల్లో శ్మశాన స్థలం ఏర్పాటు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

చంద్రగిరి: మండల పరిధిలోని కల్‌రోడ్డుపల్లిలో పంచాయతీ ఆముదాలకోన ఎస్టీ కాలనీలో రెండు రోజుల్లో శ్మశాన వాటికను ఏర్పాటు చేయనున్నట్లు ఆర్డీఓ కనక నరసారెడ్డి తెలిపారు. ఆయన బుధవారం ఆముదాలకోన ఎస్టీ కాలనీని వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు అగరాల దేవారెడ్డితో కలసి గ్రామాన్ని సందర్శించారు. గ్రామస్తులు మాట్లాడుతూ తరతరాలుగా మా గ్రామానికి శ్మశానం లేకపోవడంతో సమీపంలోని అటవీ ప్రాంతంలో దహన క్రియలు నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. అయితే అటవీశాఖ అధికారులు దహనక్రియలను అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 120 కుటుంబాలు జీవనం సాగిస్తున్నప్పటికీ తమకు శ్మశానం లేకపోవడంతో అనేక సార్లు ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు ఆయన ఎదుట వాపోయారు. దీనిపై స్పందించిన ఆర్డీఓ తక్షణమే గిరిజనులకు శ్మశానం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. త్వరితగతిన సర్వే పూర్తి చేసి గ్రామస్తులకు అనువైన ప్రదేశంలో శ్మశానం కల్పించాలని తెలిపారు. దీనిపై స్పందించిన గ్రామస్తులు ఏళ్ల తరబడి పరిష్కారం కాని శ్మశాన సమస్యపై ఆర్డీఓ స్పందించడం ఆనందంగా ఉందని, ఎమ్మెల్యే చెవిరెడ్డి, పార్టీ డివిజన్ అధ్యక్షుడు దేవారెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శిరీష, వీఆర్‌ఓ వెంకన్న నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ పీహెచ్‌సీ పనుల పరిశీలన

పలమనేరు: పట్టణంలోని అర్బన్ పీహెచ్‌సీ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని డిస్ట్రిక్ ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ ఆఫీసర్ డా.శ్రీనివాసరావు సంబంధిత ఆస్పత్రుల వైద్యులకు సూచించారు. పట్టణంలో నిర్మిస్తున్న కాకాతోపు, పాతపేట భవనాలను బుధవారం ఆయన పరిశీలించారు. మున్సిపాలిటీ పరిధిలోని గంటావూరు సచివాలయాన్ని తనిఖీ చేసి ఆ ప్రాంతంలో టీకాల కార్యక్రమంపై ఆరాతీశారు. మండంలోని కొలమాసనపల్లి పీహెచ్‌సీని తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైద్యులు మల్లికార్జున రెడ్డి, మాధవి, విజయ్, అనూకి, హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ జైశంకర్ సిబ్బంది పాల్గొన్నారు.

మాటకు కట్టుబడి పింఛన్ల పెంపు

- చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



గువ్వకల్లులో లబ్ధిదారులతో మాట్లాడుతున్న చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు : ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెన్షన్‌ను రూ.2,500 నుంచి రూ.2,750 పెంచి ఇస్తున్నారని చిత్తూరు ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు అన్నారు. పెన్షన్ వారోత్సవాలను పురస్కరించుకుని బుధవారం సాయంత్రం చిత్తూరు నగరపాలక కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పింఛన్ల మెగా చెక్కును, అలాగే వైఎస్సార్ బీమా పథకం ద్వారా 10వ వార్డుకు చెందిన యమునకు రూ.లక్ష పంపిణీ చేసి ఎమ్మెల్యే మాట్లాడారు. కుల, మత, వర్గ భేదాలు లేకుండా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు ఇస్తున్న ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో ప్రస్తుతం 17,384 మందికి పింఛన్ల రూపేణా రూ.4.88 కోట్లు ఇస్తున్నామన్నారు. కొంతమంది పింఛన్లు నిలిచాయని, అర్హులైన వారు సరైన రికార్డులు సమర్పిస్తే వాటి ఆధారంగా పునరుద్ధరిస్తామన్నారు. నగర మేయర్ ఎస్.అముద, నగర కమిషనర్ జె.అరుణ మాట్లాడారు. నగరపాలక సంస్థ పరిధిలో కొత్తగా 506 మందికి పింఛన్లు మంజూరయ్యాయని, అర్హులైన వారు సరైన పత్రాలతో ఎప్పుడైనా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అనంతరం డిప్యూటీ మేయర్ ఆర్.చంద్రశేఖర్ మాట్లాడారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, పలువురు కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు, సీఎంఎం గోపి, నగరపాలక అధికారులు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత

చిత్తూరు రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చేదిగా పథకాల అమలుతో పేరు తెచ్చుకుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని మరోసారి తమ పార్టీని ఎన్నికల్లో ఆశీర్వదించాలని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. బుధవారం చిత్తూరు మండలం గువ్వకల్లు, చింతలగుంట పంచాయతీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి పథకాల బుక్‌లెట్ అందజేస్తూ, కుటుంబాల వారీగా పొందిన లబ్ధిని ఆయన వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇళ్లస్థలాలు, రెవెన్యూ , రోడ్లు, విద్యుత్ సంబంధిత సమస్యలను స్థానికులు ఆయనకు నివేదించారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. సంబంధిత సమస్యలను ఆయా శాఖల అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు. పథకాల అమలులో ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఫలితంగా ప్రతి పేద కుటుంబమూ పథకాలతో లబ్ధి పొందుతోందని పేర్కొన్నారు. ఏ ప్రభుత్వమూ చేయని విధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు గత మూడేళ్లుగా విస్తృతంగా అమలవుతున్నాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎంఎస్ బాబునాయుడు, సర్పంచులు రాజాతి, గీత, నాయకులు సంపత్, అమర్‌నాథ్‌రెడ్డి, కుమార్, కేశవులునాయుడు, దేవేంద్రరెడ్డి, వెంకటేష్, నాగేంద్ర, దిలీప్, ఆర్ముగం, ప్రతిమారెడ్డి, సుదర్శన్, బాబు, ప్రభాకర్, భాస్కర్, ధర్మ, రాజేంద్ర, హరినాథ్‌రెడ్డి, రంజన్, తహసీల్దార్ పార్వతి, ఎంపీడీఓ రాఘవేంద్రవర్మ, ఏంఈఓ సెల్వరాజ్, మండల వ్యవసాయశాఖ అధికారి వేణుగోపాల్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు పెరుమాళ్లకండ్రిగలో గడప గడపకు..

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం పెరుమాళ్లకండ్రిగలో గురువారం ఉదయం 6.30 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు నిర్వహిస్తారని ఎంపీడీఓ రాఘవేంద్ర వర్మ తెలిపారు.

హైస్కూల్‌ను తనిఖీ చేసిన ట్రైనీ కలెక్టర్, డీఈఓ



విద్యార్థులతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్

గుడిపాల: స్థానిక నరహరిపేట జెడ్పీ హైస్కూలును బుధవారం ట్రైనీ కలెక్టర్ మేఘ స్వరూప్, డీఈఓ విజయేంద్రరావు తనిఖీ చేశారు. స్కూలు పరిసరాలను, మరుగుదొడ్ల నిర్వహణ, మధ్యాహ్న భోజనం తయారీ ప్రదేశాన్ని పరిశీలించారు. ట్రైనీ కలెక్టర్ మాట్లాడుతూ, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులకు ప్రమాణాల మేరకు భోజనం పెట్టాలన్నారు. స్కూలులో సమ్మేటివ్ పరీక్షలు ఎలా నిర్వహిస్తున్నారో పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. ఎంఈఓ రామానాయక్, హెచ్ఎం సబర్మతి, టీచర్లు పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

పూతలపట్టు: మండలంలోని తేనేపల్లె సచివాలయంలో గురువారం ఉదయం 8:30 గంటలకు పింఛన్లను ఎమ్మెల్యే ఎంఎస్ బాబు పంపిణీ చేస్తారని ఎంపీడీఓ గౌరి తెలిపారు. అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు.

అవ్వాతాతలకు సీఎం జగనన్న అండ



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే,ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు

- పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

తవణంపల్లె/బంగారుపాళెం: ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అవ్వాతాతలకు అండగా ఉంటున్నారని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. బుధవారం తవణంపల్లె, బంగారుపాళెంలోలో పెన్షన్ల వారోత్సవాలు నిర్వహించారు. వైఎస్సార్ పింఛన్ల కానుక పథకం కింద తవణంపల్లె మండలానికి నూతనంగా మంజూరైన 377 పింఛన్లు, బంగారుపాళెం మండలానికి మంజూరైన 421పింఛన్లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసి మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లు పెంచి సీఎం ఇస్తుండడంతో లబ్ధిదారుల్లో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీని ఆశీర్వదించాలని కోరారు. ఎంపీపీలు గీతారెడ్డి, అమరావతి, జెడ్పీటీసీ సభ్యులు భారతి, సోమశేఖర్, వైస్ ఎంపీపీలు పట్నం ప్రతాప్ రెడ్డి, శిరీష్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ హరిరెడ్డి, ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి, పార్టీ నాయకులు హరికృష్టారెడ్డి, ప్రకాష్‌బాబురెడ్డి, ఉమామహేశ్వర రెడ్డి, కిషోర్ రెడ్డి, మధుకుమార్, పరమేశ్వరరెడ్డి, రమణారెడ్డి, రవిరెడ్డి, పాలాక్షిరెడ్డి, దిలీప్‌నాయుడు, డేవిడ్, సర్పంచులు, వ్యవసాయసలహా మండలి జిల్లా చైర్మన్ రామచంద్రారెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్‌రాజా, తగ్గువారిపల్లె, బంగారుపాళెం సర్పంచులు వాణిప్రియ, ఉమాదేవి, సింగిల్ విండో చైర్మన్ దత్తాత్రేయరెడ్డి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మొగిలీశ్వర, తహశీల్దార్ బెన్నురాజ్, పార్టీ నాయకులు దొరస్వామి, శరత్‌రెడ్డి, కృష్ణమూర్తి, ప్రభునాయుడు, కిషోర్‌రెడ్డి, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఇంటా 'సంక్షేమ' వెలుగులు



వెంకటాపురంలో సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

ఐరాల: సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా వెలుగులతో కళకళలాడుతున్నాయని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. బుధవారం మండలంలోని వేదగిరివారిపల్లె సచివాలయ పరిధిలోని గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రజలను పలకరించారు. ఆయా కుటుంబాలు పొందిన సంక్షేమ పథకాల లబ్ధిని బుక్‌లెట్ ద్వారా తెలియజేశారు. సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి అందరూ అండగా నిలవాలని కోరారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ నవరత్న పథకాల ఫలాలు అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రజల కోసం అహర్నిశలు శ్రమిస్తుంటే.. చంద్రబాబు రోడ్‌షోలు చేస్తూ ప్రజల ప్రాణాలను బలి కొంటున్నారని విమర్శించారు. పొత్తులలేకుండా ఎన్నికలకు వెళ్లలేని చంద్రబాబు మరోసారి ప్రజలను మభ్యపెట్టడానికి రోడ్‌షోలు చేస్తున్నారని అపహాస్యం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మోహన్, పార్టీ మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి, సర్పంచ్ రాజేంద్ర, ఎంపీటీసీ లోకేశ్వర రెడ్డి, అధికారులు, నాయకులు చంద్రశేఖర్, నరేష్‌కుమార్, జనార్ధన్, గంగాధర్‌నాయుడు, రవీంద్రరెడ్డి, దొరబాబు, రాము, ధనంజయ పాల్గొన్నారు.

పేర్నాటిని గెలిపించాలని ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



కరపత్ర ప్రచారం చేస్తున్న రాధాకృష్ణారెడ్డి

పూతలపట్టు: పూతలపట్టు మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జోరుగా చేస్తున్నారు. తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్ రెడ్డికి ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పోలవరం, పంటపల్లె, వావిల్‌తోట, గొడుగుచింత పంచాయతీలలో రాధాకృష్ణాఆ రెడ్డి, సాయిరెడ్డి కరపత్ర ప్రచారం చేశారు.

తల్లిపాలు బిడ్డలకు శ్రేష్టం



మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

గంగాధరనెల్లూరు: తల్లిపాలు బిడ్డలకు శ్రేష్టమని తూగుండ్రం వైద్యాధికారి దివ్య తెలిపారు. మండలంలోని ఆవలకొండ గ్రామంలో బుధవారం తల్లిపాల విశిష్టత, వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పించారు. వైద్యాధికారి మాట్లాడుతూ తల్లిపాలతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. పుట్టిన బిడ్డలకు ముర్రుపాలు పట్టించాలన్నారు. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవాలు చేసుకోవాలని కోరారు. ఆరోగ్యవిద్యాధికారి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ బిడ్డలకు ముందస్తుగా వ్యాధి నిరోధక టీకాలు వేయించినట్లయితే 13 ప్రాణాంతక వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చన్నారు. సూపర్‌వైజర్ వరలక్ష్మి, సీహెచ్‌ఓ రేవతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ



పింఛన్ పంపిణీ చేస్తున్న మేయర్

చిత్తూరు అర్బన్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని నగర మేయర్ ఎస్.అముద అన్నారు. బుధవారం 39వ వార్డులో పెంచిన వైఎస్సార్ సామాజిక పింఛన్లను పంపిణీ చేసి ఆమె మాట్లాడారు. స్థానిక వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్ట్

చిత్తూరు అర్బన్: యాదమరి మండలం తంజావూరులో బుధవారం ఎస్ఈబీ అధికారులు దాడులు చేశారు. సారా విక్రయిస్తున్న చిత్ర (32) అనే మహిళను అరెస్ట్ చేసి ఆమె నుంచి 2లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఐ మోహన్‌బాబు, సిబ్బంది సుబ్రమణ్యంగౌడు, క్రిష్ణయ్య, నాగరాజు, వెంకటేష్, క్రిష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.


ఎంబీయూలో వర్క్‌షాపు



చంద్రగిరి: మండల పరిధిలో మోహన్‌బాబు యూనివర్సిటీలో బుధవారం నుంచి మూడు రోజుల పాటు రీసెర్చ్, ఇన్నోవేషన్ వర్క్‌షాపును ప్రారంభించారు. దీనికి సింగపూర్‌లోని ఎన్‌టీయూ ప్రొఫెసర్ డాక్టర్ సుందరరాజన్, మైసూరు జేఎస్ఎస్ సైన్స్ అండ్ టెక్నాలజీ యూనివర్సిటీ ప్రొఫసర్ డాక్టర్ బీఎస్ మహానంద్ రిసోర్స్ పర్సన్‌లుగా వ్యవహరిస్తున్నారు. ఎంబీయూ వీసీ నాగరాజ్ రాంరావు, రిజిస్ట్రార్ సారథి ఇతర డీన్‌లె హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.

తెప్పపై శ్రీకామాక్షి

అమ్మవారి కటాక్షం



పుష్కరిణిలో తెప్పపై విహరిస్తున్న శ్రీకామాక్షి అమ్మవారు (ఇన్‌సెట్‌లో) తెప్పపై శ్రీకామాక్షి అమ్మవారు

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వరస్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న తెప్పోత్సవాల్లో నాలుగో రోజు బుధవారం సాయంత్రం శ్రీకామాక్షి అమ్మవారు తెప్పపై భక్తులను అనుగ్రహించారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 7.30 గంటల వరకు అమ్మవారి తెప్పోత్సవం వేడుకగా సాగింది. విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన తెప్పపై అమ్మవారు కొలువై పుష్కరిణిలో ఏడు చుట్లు తిరిగి భక్తులకు కనువిందు చేశారు. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు ఆలపించిన భక్తి సంకీర్తనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో పార్థసారథి,ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చీకటి లోకానికి వెలుగు రేఖ లూయిస్ బ్రెయిలీ



అంధ విద్యార్థికి బహుమతి ప్రదానం చేస్తున్న అధికారులు

బంగారుపాళెం: చీకటి బతుకులకు వెలుగు రేఖలు నింపిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేంద్రన్ అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో బుధవారం లూయిస్ బ్రెయిలీ జయంతిని ఘనంగా నిర్వహించారు. బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి హెచ్ఎం మాట్లాడారు. నాలుగేళ్ల వయసులో ప్రమాదవ శాతు బ్రెయిలీ కంటి చూపు కోల్పోవడం మొదలుకుని పట్టుదలతో చదివి, చుక్కల వరుసలతో అంధుల లిపిని కనుగొనేవరకు ఆయన జీవితం గురించి స్ఫూర్తిదాయకంగా ప్రసంగించారు. స్కూల్ అసిస్టెంట్ భార్గవ్‌రామ్ మాట్లాడుతూ, భవిత కేంద్రంలో విద్యను అభ్యసించిన అంధురాలు రేవతి ప్రస్తుతం బీఈడీ చేయడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సహిత విద్య ఉపాధ్యాయురాలు హిమబిందు, మీరయ్య, సీఆర్‌పీలు సుశీల, విల్వనాథం, ప్రేమలత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయులకు గుర్తింపు



పోటీల్లో ప్రతిభ చూపిన ఛాత్రోపాధ్యాయులతో అధ్యాపకులు

కార్వేటినగరం: గురువులకు సమాజంలో ప్రత్యేక స్థానం ఉంటుందని జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్) ఇన్‌చార్జి ప్రిన్సిపల్ చెంగల్‌రాజు అన్నారు. బుధవారం డైట్‌లో ప్రెషర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకోవడం గౌరవంగా భావించాలని తెలిపారు. ఛాత్రోపాధ్యాయుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పలు పోటీల్లో ప్రతిభ చూపిన ఛాత్రోపాధ్యాలకు మెమొంటోలను అందించారు.

పేదలకు సేవ–భగవంతునికి సేవ



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న విదేశీ డాక్టర్లు

పుత్తూరు రూరల్: పేదలకు సేవ భగవంతుని సేవతో సమానమని మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పెన్షనర్స్ భవనంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం, గుడ్ షెప్పర్డ్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న కమిషనర్ మాట్లాడుతూ పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పెన్షనర్స్ సంఘ సభ్యులు అభినందనీయులన్నారు. ప్రత్యేకించి వృద్ధుల ఆరోగ్యంపై దృష్టి సారించి వైద్య సేవలందించడం విశేషమన్నారు. శిబిరంలో కంటి, దంత, బీపీ, షుగర్, జనరల్ సమస్యలకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను అందజేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ శిబిరంలో 306 మంది వైద్య సేవలందుకున్నట్లు పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు బి.భాస్కర్‌రాజు తెలిపారు. గుడ్ షెప్పర్డ్ హాస్పి టల్ ఆధ్వర్యంలో అమెరికన్ డాక్టర్లతో పాటు, స్థానిక డాక్టర్లు సేవలందించినట్లు వివరించారు. హాస్పిటల్ నిర్వాహకులు హెన్రీభాస్కర్, ప్రవీణ్‌కుమార్, పెన్షనర్ల సంఘ నాయకులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు తవణంపల్లె విద్యార్థులు

అండర్–11 మినీ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక



అండర్–11 మినీ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఇషా విద్యానికేతన్ ఉపాధ్యాయులు

తవణంపల్లె: మండలంలోని ఇషా విద్యానికేతన్ స్కూల్ విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక కావడంపై ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఉమాపతి, ఉపాధ్యాయ బృందం, పీఈటీలు అరుణ్‌కుమార్, హరిబాబు హర్షం వ్యక్తం చేశారు. గత సంవత్సరం డిసెంబర్‌లో 25వ తేదీ నుంచి 30వ తేదీ వరకు మహారాష్ట్రలోని నాసిక్‌లో జాతీయ స్థాయి అండర్–11 మినీ ఫుట్ బాల్ పోటీలు జరిగాయని చెప్పారు. ఈ పోటీల్లో 15 రాష్ట్రాల జట్లతో తమ పాఠశాల విద్యార్థులు పోటీపడి గెలిచి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వెల్లడించారు. 2023న జూన్ నెలలో యూరప్ ఖండంలోని యుగోస్లేవియా దేశంలో జరిగే వరల్డ్ మినీ ఫుట్ బాల్ పోటీల్లో పాల్గొంటారని వివరించారు. తమ పాఠశాలలోని ఆదిత్య(10), గిరీష్‌నిత్యకుమార్(7), మహిధర్(7), బద్రి(8), రెడ్డిసాయి(7), అచ్యుత్ రెడ్డి(7), సంకీర్త్(8) అనే విద్యార్థులు అంతర్జాతీయ పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. అంతర్జాతీయ పోటీల్లో తమ సత్తా చాటి విజయం సాధించాలని ఉపాధ్యాయులు, తల్లి దండ్రులు ఆకాంక్షించారు.

నగర అభివృద్ధే కౌన్సిల్ ప్రధాన అజెండా

తిరుపతి తుడా : తిరుపతి నగర అభివృద్ధే మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ ప్రధాన అజెండా అని, అందుకు అనుగుణంగానే కౌన్సిల్ కీలక నిర్ణయాలు తీసుకుంటూ ముందుకెళుతోందని నగర మేయర్ డాక్టర్ శిరీష పేర్కొన్నారు. కార్యాలయంలోని సమావేశ మందిరంలో డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్, ముద్రనారాయణ, కమిషనర్ అనుపమ అంజలి, అన్ని విభాగాధిపతులతో ప్రీ–కౌన్సిల్ మీట్‌ను బుధవారం నిర్వహించారు. ప్రాధాన్యత క్రమంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, వాటి పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. మేయర్ మాట్లాడుతూ కౌన్సిల్ నిర్ణయాలకు అనుగుణంగా అధికారులు అభివృద్ధి పనులను చేపడుతున్నారని చెప్పారు. చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. ప్రస్తుతం చేపట్టిన 13 మాస్టర్‌ప్లాన్ రోడ్ల నిర్మాణ పనులపై అధికారులు ప్రధానంగా దృష్టి సారించాలని సూచించారు. ఇందుకు అవసరమైన నిధులను విడుదల చేయనున్నట్లు ఆమె చెప్పారు.